క్లుప్తంగా

ఘనంగా లక్ష బిల్వార్చన



ఆత్మకూరు: మండలకేంద్రంలోని శ్రీపార్వతీ దేవి సమేత మహాదేవస్వామి పంచకూట శివాలయంలో ఆదివారం కార్తీక అమావాస్యను పురస్కరించుకొని శివుడికి లక్ష బిల్వార్చన చేశారు. వేద పండితులు వేదమంత్రోచ్చరణలతో అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిష్టయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

వేలేరు: మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ పోరాటం స్ఫూర్తిదాయకమని ముదిరాజ్ సొసైటీ చైర్మన్ ఇట్టబోయిన సంపత్ అన్నారు. పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ భవనంలో కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ భూపతిరాజు, ముదిరాజ్ సంఘం నాయకులు వనం సాంబయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి మృతి

ధర్మసాగర్: మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు బలభద్ర చంద్రమౌళి (80) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు రామ్మూర్తి, నాయకులు గజ్జల దామోదర్, పేరాల నాగభూషణం, రాపోలు సురేశ్, స్థానిక నాయకులు డాక్టర్ బలభద్ర వెంకన్న, రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పరామర్శ



ఆత్మకూరు: మండలంలోని గూడెప్పాడ్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మహ్మద్ రఫీ కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధిత కుటుంబాన్ని మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి సైతం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ బాబుమియా ఉన్నారు.

'కాంగ్రెస్ కృషి ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు'



కాజీపేట: రాష్ట్ర విభజన చట్టంలో కాంగ్రెస్ పార్టీ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం పొందుపర్చడంతోనే నేడు ఆ కల సాకారమైందనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి డీసీసీ అధ్యక్షుడు, నేటి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. సమావేశంలో కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, షేక్ అజ్గర్, తమ్మడి మధు మానస, మేకల ఉపేందర్, ఇప్ప శ్రీకాంత్, క్రాంతిభరత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'ప్లాటినం జూబ్లీ' ప్రత్యేకత చాటుకుంటోంది



వరంగల్ చౌరస్తా: ప్లాటినం జూబ్లీ హైస్కూల్ ఏడేళ్ల క్రితం విద్యాసంస్థను ప్రారంభించి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా తయారు చేస్తూ తన ప్రత్యేతను చాటుకుంటోందని నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. వరంగల్ అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో 70 ఏళ్ల వేడుకల కార్యక్రమానికి నగర మేయర్ ముఖ్యఅతిథిగా ఆదివారం సాయంత్రం విచ్చేసి మాట్లాడారు. పిల్లలకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబర్చాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ జగదీష్ పేచే అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉత్తం చటర్జీ, ఏకేఈఎస్ఐ సీఈఓ ఫర్హాద్ మర్చంట్, హెడ్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ త్రిషసేన్, రీజినల్ హెడ్ ఇక్బాల్ సమ, కమ్యూనికేషన్ హెడ్ దీనా శామ్యూల్, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, సెకండరీ సెక్షన్ హెడ్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతన్నకు 'మద్దతు'

- మండలంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు
- ఐకేపీ 4, విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో 6 కేంద్రాల ఏర్పాటు



ఐకేపీ సెంటర్‌లో కొనుగోలు చేసిన ధాన్యం



బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

ఎల్కతుర్తి: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర లభిస్తుంది. ఐకేపీ, విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో కల్లాల వద్దే కాంటాలు నిర్వహించి సొమ్ము చేసుకునే దళారులకు చెక్ పడినట్లైంది. ఎల్కతుర్తి మండల వ్యాప్తంగా 22,500 ఎకరాల సాగు భూములు ఉండగా.. ఈ ఖరీఫ్‌లో సుమారు 15,300 ఎకరాల్లో వరి సాగు నమోదైంది. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కోతలకు ముందుగానే ఎల్కతుర్తి సెంటర్‌ను ప్రారంభించగా మిగతావి తర్వాత ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 26,828 క్వింటాళ్ల వరిధాన్యాన్ని కొనుగోళ్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎల్కతుర్తి సెంటర్‌లో 2,954 క్వింటాళ్లు, సూరారంలో 2,346, దండేపల్లి 7,606 క్వింటాళ్లు, సూరారంలో 7,848 క్వింటాళ్లు, దండేపల్లిలో 7,701 క్వింటాళ్లు, కేశవాపూర్‌లో 3,673 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో..

విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో 6 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 769మంది రైతులకు ట్యాబ్ ఎంట్రీ చేసిన 699 మంది రైతుల నుంచి 40,100 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు బ్యాంక్ సీఈఓ తిరుపతి తెలిపారు. కాగా, గత రబీ సీజన్‌లో సాగు చేసిన వరిపంట అకాల వర్షాలతో దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంటలకు అధికారులు ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగు నీరందించడంతోపాటు విస్తారంగా వర్షాలకు పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చాయి. దీనికి తోడు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్నాలకు రూ.500 బోనస్ అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరికోతలు ముగిశాయి. అక్కడక్కడ ఆరబెట్టిన ధాన్యం ఉండడంతో ఈనెల 15వరకు ధాన్యం కొనుగోళ్లను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 మద్దతు ధర చెల్లిస్తోంది.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు చేట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం విక్రయించిన ప్రతీ రైతు వివరాలను ఆన్‌లైన్‌లో ప్రభుతానికి తెలియజేస్తున్నాం.. నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరుగుతుంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నాం. ఈనెల 15వరకు కొనుగోళ్లను కొనసాగిస్తాం.

–రవీందర్, ఐకేపీ ఏపీఎం ఎల్కతుర్తి

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థి విఘ్నేష్

శాయంపేట : హనుమకొండ జిల్లా కేంద్రం ప్రశాంత్ నగర్‌లోని తేజస్వి ఉన్నత పాఠశాలలో నవంబర్ 28 నుంచి 30 వరకు నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కాట్రపల్లి సీఎస్ఐ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఆరు ప్రాజెక్టుల్లో చందు నాయక్ ప్రదర్శన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది. శాయంపేట ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో చదువుతున్న కొమ్ముల కృష్ణవేణి.. వేస్ట్ మేనేజ్మెంట్ థీమ్, శివరాత్రి దీవెన రిసోర్స్ మేనేజ్మెంట్ థీమ్‌లలో ప్రతిభ కనబరిచింది. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి బాసాని విఘ్నేష్ రూపొందించిన ప్రదర్శనకు సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం సాధించగా జూనియర్ విభాగంలో 8వ చదువుతున్న మహమ్మద్ అసద్ అలీ ద్వితీయ స్థానం సాధించారు. ఈ విజేతలకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు షీల్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ సామ్ జార్జ్, శ్రీలత, వనం వెకంటేశ్వరరావు, గైడ్ టీచర్స్ అనిల్‌కుమార్, రంజిత్ కుమార్, నందుల వెంకటసత్యప్రసాద్, ఎండీ అజీముద్దీన్, ఉపాధ్యాయులు రాజునాయక్, ప్రవళిక పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ ఇ టెక్నో పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి ఆదివారం తెలిపారు. గత నెల 28 నుంచి 30 వరకు హనుమకొండలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ఓపెన్‌వెల్ ఆర్గానిక్ ఫామ్ అనే అంశంపై 8వ తరగతి విద్యార్థి నితిన్ ప్రథమ బహుమతి సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. అదే విధంగా తోట శివకేశవ, గట్టు అనన్య మూడో స్థానం సాధించినట్లు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ముఖ్యసలహాదారులు మల్లయ్య, సదయ్య, డైరెక్టర్లు రాకేశ్ భాను, దినేశ్‌చందర్ అభినందించారు.

అభివృద్ధికి సహకరిస్తా..

- కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండల అభివృద్ధికి సహకారమందిస్తానని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆదివారం సందర్శించి భద్రకాళి సమేత వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మండల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బోధన, నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడెప్పాడ్‌లోని పెద్దాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలకు పెద్ద పీట వేస్తుందన్నారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని తెలిపారు. గురుకుల పాఠశాలకు సోలార్ వాటర్ హీటర్లు అందిస్తామన్నారు. పెద్దాపూర్‌లో శాశ్వత భవన నిర్మాణం చేపడతామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కావాలనే గురుకుల పాఠశాలలపై విమర్శలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ హయాంలో గురుకుల పాఠశాలలను గాలికి వదిలేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గురుకుల పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచనతో ఆలోచనాశక్తి మెరుగు

ప్రజా పాలన– ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పలు మండలాల్లో ఆదివారం వివిధ పాఠశాలల విద్యార్థులకు 'పునరుత్పాదక ఇంధన వనరులు' అనే అంశంపైన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అధికారులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వ్యాసరచన వంటి పోటీల ద్వారా ఆలోచనా శక్తి మెరుగుపడుతుందని తెలిపారు. నిత్యం పోటీ పరీక్షల్లో పాల్గొంటూ ఉత్తములుగా ఎదగాలని చెప్పారు.

-ధర్మసాగర్/ఆత్మకూరు/ఎల్కతుర్తి/దామెర/శాయంపేట /కమలాపూర్



ధర్మసాగర్: మాట్లాడుతున్న ఎంపీడీఓ అనిల్



ఎల్కతుర్తిలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ఐనవోలు: విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ ఆనందం



కమలాపూర్: విజేతలకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ తదితరులు

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

- ఏఐటీయూసీ జిల్లా ఇన్‌చార్జ్ హంసరెడ్డి



ఏఐటీయూసీలో చేరుతున్న కార్మికులు

దామెర: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్‌రెడ్డి హంసరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఏఐటీయూసీలో చేరగా కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులను కేంద్రం ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం చేస్తుందని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. లేబర్ కోడ్‌లో ఉన్న 44 చట్టాలను యథావిధంగా అమలు చేయాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు శ్రమదోపిడీకి గురవుతున్నారని వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలో కూడా అంగన్‌వాడీ కార్మికులను పర్మనెంట్ చేసి రూ.26వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులకు కమిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ నెల 16న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు మంద భద్రయ్య, ఏఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, మహిళా విభాగ కన్వీనర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

దామెర: పేకాట ఆడుతూ పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుగొండ శివారులో గ్రామానికి చెందిన కొంతమంది శనివారం పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై తమ సిబ్బందితో దాడి చేశాడు. దీంతో గ్రామానికి చెందిన గొల్లపెల్లి శ్రీనివాస్, సంకెళ్ల సంపత్, జన్ను దయాకర్ పట్టుపడ్డారు. రూ.5,460 నగదు, 4 సెల్ ఫోన్లు, 52 పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా పోలీస్‌వాహనం చూసి పారిపోయిన కందికొండ రవీందర్, సాదు మల్లయ్య, నల్ల బాబు, జన్ను కిరణ్, మేడిపల్లి కుమారస్వామి, జన్ను రమేశ్‌తోపాటు పైన పేర్కొన్న ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

వేలేరు: గడ్డికట్టలు చుట్టే మిషన్‌లో ప్రమాదవశాత్తు చేయి ఇరుక్కుని ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మరిపేట గ్రామానికి చెందిన జోడుముంతల చిరంజీవి అనే ట్రాక్టర్ డ్రైవర్ పనిలో భాగంగా గడ్డికట్టలు చుట్టడానికి మల్లికుదుర్లలోని ఓ రైతు వ్యవసాయ పొలానికి వెళ్లాడు. కట్టలు చుడుతున్న క్రమంలో గడ్డికట్టలకు చుట్టే దారం తెగిపోయింది. దీంతో చిరంజీవి ట్రాక్టర్ దిగి దారం సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చేయి మిషన్‌లో ఇరుక్కుని నుజ్జునుజ్జు కావడంతోపాటు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పచ్చని చెట్లను కాపాడుకోవాలి

కాజీపేట అర్బన్: పర్యావరణానికి తోడ్పడే పచ్చని చెట్లను కాపాడుకోవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్ కోరారు. హంటర్‌రోడ్డు నుంచి అదాలత్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకు అడ్వటైజ్‌మెంట్ బోర్డులను ఏర్పాటు చేసేందుకు మొలలు కొట్టడంతో అవి చనిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఆ మొలలను ఆదివారం తొలగించినట్లు ఆయన తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సీఐ పులి రమేశ్



అవగాహన కల్పిస్తున్న సీఐ రమేశ్

ఎల్కతుర్తి: మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ అన్నారు. ఆదివారం ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రం శివారు ప్రాంతంలో వెలసిన గ్రానైట్ కంపెనీల లేబర్ కూలీలకు మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ మోసాలపై కల్పించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువగా ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తులకు ఓటీపీ, బ్యాంక్ ఖాతా నంబర్లు చెప్పకూడదని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసానికి గురైన వ్యక్తులు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని చెప్పారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కమలాపూర్: మండల కేంద్రంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధి కోసం మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన కంచనకుంట్ల సాంబశివరెడ్డి-వినోద దంపతులు ఆదివారం రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు సాంబశివరెడ్డి కుమారుడు శ్రీధర్‌రెడ్డి-కీర్తిరెడ్డి దంపతులు ఆ విరాళం మొత్తాన్ని ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో గురుస్వామి ఇందుర్తి జానకి రామారావు, ఆలయ కమిటీ చైర్మన్ అశోక్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, సాగర్, కోశాధికారి కుమారస్వామి, కార్యదర్శి కృష్ణమూర్తి, డైరెక్టర్ సుధాకర్, గుస్వాములు సమ్మయ్య, శ్రీధర్, సదాచారి, సాగర్, హరికృష్ణ, జక్కు సాయి, అయ్యప్ప భక్తుడు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో విద్యార్థులు

ధర్మసాగర్: మండలంలోని నారాయణగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1981–82 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం అదే పాఠశాలలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 42 సంవత్సరాల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకొని ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. విదేశాలలో స్థిరపడిన వారు, ఉద్యోగాలు, వ్యాపారాలు, వివిధ వృత్తులు చేసుకుంటూ జీవిస్తున్న స్నేహితులంతా బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు బుర్ర ఆనందం, కందుకూరి దేవదాసు ఆధ్వర్యంలో నాటి ప్రధానోపాధ్యాయులు కుందూరు నర్సింహారెడ్డి, ఎస్.రాధాకిషన్‌రావు, గురువులు కే.రాధాకిషన్ రావు, సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్ రావు, జ్యోతి, కాసగోని ఉప్పలయ్యలను ఘనంగా సన్మానించారు. వివిధ స్థాయిల్లో స్థిరపడిన నాటి విద్యార్థులను సన్మానించుకున్నారు. రాజమౌళి, నిరంజన్, గిరిజ, దేవేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, కనకయ్య, గట్టయ్య, మధుసూదన్, రమేశ్, సులోచన, భాగ్యలక్ష్మి, శైలజ, రమాదేవి, విజయరాణి, స్వరూప, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ శివాలయంలో మహా లింగార్చన



కాశిబుగ్గ శివాలయంలో భక్తులు



చైతన్యపురి కాలనీలో..

వరంగల్: కార్తీకమాస బహుళ అమావాస్యను పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం మహన్యాస పూర్వక మృతిక మహాలింగార్చన (365)రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు గుండేటి రజినీ కుమార్, మార్త సందీప్‌శాస్త్రి, అంకం కల్యాణ్, మార్త మోహన్, పెద్దూరి శ్రీనివాసులు, పోరండ్ల శివ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ వెంకట్రావు, రవి, శ్రీను, పెద్దన్న, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవ వేడుకల ముగింపు ఉత్సవాలను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో దేవతామూర్తులకు పండితులు అభిషేక, అర్చనలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసి ఆశీర్వాదం చేశారు.

వితంతువుల క్రిస్మస్ వేడుకలు



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని పునీత్ ఆంథోనీ చర్చిలో వితంతువుల క్రిస్మస్ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈమేరకు వితంతువులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జేరోమ్ మాట్లాడుతూ భర్తలు కోల్పోయిన మహిళలు ఆదరాభిమానాలు తగ్గి, అనేక బాధలకు గురవుతున్నారని, వారిని ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో కరుణాపురం ఫాదర్ భాస్కర్ అసీస్, సంఘం అధ్యక్షుడు దోమ కుమార్, పసుల దాస్, మంద కిశోర్ బొక్క ప్రసాద్, దోమ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.